# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 08-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పోర్చుగల్ దేశంలో పర్యటిస్తున్నారు.
- ❖ పీఎం ముద్ర యోజన కింద ఇప్పటివరకు 33 లక్షల కోట్ల రూపాయల రుణాలు అందిచామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- ❖ వక్ఫ్ (సవరణ) చట్టం ఈరోజు నుండి అమల్లోకి వచ్చింది.
- ❖ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రిఫైనరీ కేంద్రాల్లో భారత్ ఒకటిగా నిలుస్తుందని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పురి వెల్లడించారు.

=======================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పోర్చుగల్ దేశంలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఈరోజు భారత్, పోర్చుగల్ దేశాల మధ్య ప్రతినిధి స్థాయి చర్చలు నిర్వహించారు. పోర్చుగల్ అసెంబ్లీ స్పీకర్ జోస్ పెడ్రో ద్రౌపది ముర్ముతో ఈరోజు సమావేశమయ్యారు. అంతకు ముందు రాష్ట్రపతి పోర్చుగల్ అసెంబ్లీలో గౌరవ వందనం స్వీకరించారు. ఈ సమావేశంలో రెండు దేశాల సంబంధాలను బలోపేతం చేసుకునే మార్గాలను ఇరువర్గాలు చర్చించాయి. అలాగే పోర్చుగల్ ప్రధాన మంత్రి లూయిస్ మాంటెనెగ్రోతో రాష్ట్రపతి సమావేశమవుతారు. పోర్చుగల్ పర్యటనను ముగించుకున్న తర్వాత, ద్రౌపది ముర్ము స్లోవేకియాకు వెళ్లనున్నారు.

=======================

ప్రధానమంత్రి ముద్ర యోజన కింద పూచీకత్తు లేకుండా ఇప్పటివరకు 33 లక్షల కోట్ల రూపాయల రుణాలు అందిచామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశంలో చిరు వ్యాపారులను ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ముద్ర యోజన ఈరోజుతో 10 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఢిల్లీలో ప్రధానమంత్రి లబ్దిదారులతో మాట్లాడుతూ.. ముద్రా యోజన అనేక మందికి వ్యవస్థాపక నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అవకాశాలను కల్పించిందని అన్నారు. ఉపాధి కల్పనకు, గణనీయమైన ఆర్థిక అభివృద్ధికి ఇది ఎంతగానో దోహదపడిందని చెప్పారు. అల్లాగే సామాన్య పౌరుల ఆదాయాలు పెరిగాయని తెలిపారు. గత పదేళ్లలో, ఈ పథకం కింద దాదాపు 52 కోట్ల రూపాయలకు పైగా రుణాలు ఆమోదింపబడ్డాయని ప్రధానమంత్రి తెలుపుతూ..

(వాయిస్ 38 సెకన్లు)

=======================

వక్ఫ్ (సవరణ) చట్టం ఈరోజు నుండి అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పార్లమెంట్ ఈ బిల్లును ఆమోదించిన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. దీంతో వక్ఫ్ (సవరణ) బిల్లు ఒక చట్టంగా మారింది. వారసత్వ ప్రదేశాలను కాపాడటం, సామాజిక సంక్షేమాన్ని ప్రోత్సహించడం, నిబంధనలతో వక్ఫ్ ఆస్తుల నిర్వహణను క్రమబద్ధీకరించడం ఈ నూతన చట్టం లక్ష్యం. వక్ఫ్ పరిపాలన కోసం లౌకిక, పారదర్శక, జవాబుదారీ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి  వక్ఫ్ (సవరణ) చట్టం ఉద్దేశించబడింది.

=======================

పెట్రోలియం ఇందన రంగంలో అనేక రాష్ట్రాల్లో పెట్టుబడులు వస్తున్నాయనీ.. అవకాశాలు వినియోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఒడిశా రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయని పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. ఒడిశాలోని పారాదీప్ వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రిఫైనరీ ఏర్పాటు చేసేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఒడిశా ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి మాట్లాడుతూ... గతంలో 27 దేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకునే వాళ్లమని, ఇప్పుడు 40 దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రిఫైనరీల్లో భారత్ ఒకటిగా నిలుస్తుందని పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

=======================

భారత్, ఇజ్రాయెల్ దేశాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యం మరింత  అభివృద్ధి చెందుతోందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈరోజు ఆయన న్యూఢిల్లీలో ఇజ్రాయెల్ వ్యవసాయ మంత్రి అవి డిచ్టర్ తో కలిసి వ్యవసాయ రంగంలో ద్వైపాక్షిక సహకారానికి సంబంధించిన ఒప్పందాలపై సంతకం చేశారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ... వ్యవసాయం, ఆవిష్కరణ, సాంకేతికత వంటి తదితర రంగాలలో ఇరు దేశాలు పరస్పర సహకారాన్ని కలిగి ఉన్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో చిన్న కమతాలు ఉన్న రైతులకు వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో అధిక దిగుబడిని విత్తనాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించిందని మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలియజేశారు.

విరామం

=======================

దేశంలోని 10 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత పాంతం పరిధిలోని 15 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ప్రభుత్వం విలీనం చేయనుంది. ఒక రాష్ట్రం... ఒక ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు విధానాన్ని అనుసరించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ బ్యాంకుల విలీన ప్రక్రియను చేపట్టింది. దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఉండగా, వీటి సంఖ్య 28కి తగ్గనుంది. ప్రజా ప్రయోజనాలు, గ్రామీణ బ్యాంకుల ప్రయోజనాల దృష్ట్యా రీజినల్ రూరల్ బ్యాంక్స్ యాక్ట్, 1976ను అనుసరించి ఈ ఏకీకృత ప్రక్రియను అమలు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

=======================

భారతదేశాన్ని ప్రపంచ సముద్ర శక్తి కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందని కేంద్ర ఓడరేవులు, రవాణా శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. కొచ్చిలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ ప్రాంగణంలో బాలికల హాస్టల్ కమ్ లైబ్రరీ భవనానికి కేంద్రమంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ... విశాలమైన తీరప్రాంతం కలిగిన భారతదేశం సముద్రయానంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. దేశంలో సముద్ర యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. మారిటైమ్ నిపుణులు సాంప్రదాయ సముద్రయాన నైపుణ్యాలలో మాత్రమే కాకుండా, షిప్పింగ్, లాజిస్టిక్స్ లో కూడా కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని కేంద్రమంత్రి సూచిస్తూ.....

(వాయిస్ 40 సెకన్లు)

=======================

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లులను గవర్నర్ రిజర్వ్ చేయడం చట్ట విరుద్ధమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 10 బిల్లులకు గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదం తెలపకపోవడంతో ఈ అంశంపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌ల నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. గవర్నర్ ఆర్ఎన్ రవి చట్టవిరుద్ధంగా వ్యవహించారనే తీర్పు వెలుడించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్ కు అనుమతిని నిలిపివేసే విచక్షణాధికారం లేదని, మంత్రి మండలి సలహా మేరకు వ్యవహరించాలని స్పష్టం చేసింది. వెంటనే ప్రభుత్వం ప్రతిపాదించిన 10 బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపాలని ఆదేశించింది.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు న్యూఢిల్లీలో దుబాయ్ క్రౌన్ ప్రిన్స్, షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశం-యుఎఇ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో దుబాయ్ కీలక పాత్ర పోషించిందని సామాజిక మాధ్యమం వేదికగా ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ పర్యటన భారతదేశం-యుఎఇ స్నేహాన్ని మరింత పటిష్టం చేస్తుందని, అలాగే భవిష్యత్‌లో బలమైన సహకార మార్గాన్ని సుగమం చేస్తుందని పేర్కొన్నారు.

=======================

చైనా తన ప్రతీకార సుంకాలను ఉపసంహరించుకోకపోతే ఆ దేశ వస్తువులపై అదనంగా 50 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై చైనా ఘాటుగా స్పందించింది. అమెరికా "బెదిరింపు వ్యూహాలను" మానుకోవాలని.. ఇటువంటి వ్యాఖ్యలను ఎప్పటికీ అంగీకరించబోమని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. పెరుగుతున్న వాణిజ్య వివాదంలో చివరి వరకు పోరాడతామని చైనా స్పష్టం చేసింది.

=======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభంతో ముగిసాయి. ఉదయం సెన్సెక్స్ 73,137 లాభాల్లో ప్రారంభమై.. చివరికి 1,089 పాయింట్ల లాభంతో 74,227 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 374 పాయింట్ల లాభంతో 22,535 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.27గా ఉంది.

=======================
=======================